# సానుభూతి

గోడ గడియారం పన్నెండు కొట్టింది.

అర్ధరాత్రి అయినా ఆకు అల్లల్లాడటం లేదు. వాయుదేవుడు ఊపిరి బిగబట్టి ఎవరికోసమో పొంచి వున్నాడా అనిపిస్తుంది. తెలిమబ్బులతో నీలాకాశం నెర్రెలిచ్చిన సున్నం గోడలా వుంది. చంద్రుడు ఒంటరిగా, నక్షత్రాలకు దూరంగా అలసిపోయినట్లు, చాలా కాలంగా అలసిపోయి వున్నట్లుగా పయనిస్తున్నాడు మెల్ల మెల్లగా.

టెక్నికలర్ నైలాన్ వస్త్రాలలో సొక్కి సోలిపోయిన అందమైన యువతిలా వుంది. హైదరాబాదు నగరం నిసబ్బంగా. పగటి ఎండవేడిమికి అలసిపోయిన జనం కొట్టేసినట్లు నిద్రపోతున్నారు. వారి వారి బాధలూ, గాథలూ కూడా సుషుప్తావస్థలో వున్నాయి.

శ్రీమంతుల అంతస్థులను ఎత్తి చూపించే బంజారా హిల్సులోని ఆ రెండతస్థుల సుందర భవనంలో, ఎయిర్ కండిషన్ రూములో డన్‌లప్ గద్దెలమీద నిద్రపట్టక రెండు జీవులు అటూ ఇటూ అశాంతిగా పొర్లుతున్నాయి.

'ఏం లక్ష్మీ! నిద్రపోలేదూ?' ప్రశ్నించాడు భర్త.

'ఏమండీ! మరి....!' అంటూ చివుక్కున లేచి కూర్చుంది భార్య.

'లైటు వేసేదా?' అంటూ లేచి వెళ్ళి స్విచ్ ఆన్‌చేశాడు ప్రకాశరావు టేబుల్‌మీద వెలవెలపోతున్న బెడ్‌లైటును ఆర్పివచ్చి భార్య ప్రక్కన కూర్చున్నాడు ప్రకాశరావు.

ఇద్దరి ముఖాలమీద విషాదం నల్లని ముసుగు వేసింది. వ్యధ మనస్సులను మెలివేస్తున్నది.

"ఏమండీ! ఇవ్వాళ్టికి ఎన్నాళ్ళయింది మన బాబు!" గొంతులో ఏదో ఉండచుట్టుకుపోయి మాటలు పెగల్లేదు.

"ఇవ్వాళ్టికి సరిగా ఎనిమిదిరోజు లయింది" అన్నాడు ప్రకాశరావు విషాదంతో భారంగావున్న స్వరంతో.

"ఎనిమిది రోజులా? ఎంతకాలమో అయిపోయినట్లు అనిపిస్తుందండీ! నా బాబును చూసుకొని ఎనిమిది

సంవత్సరాలు.... కాదు.... ఎనిమిది యుగాలు అయినట్లుంది ”
రెండు చేతుల్లో ముఖాన్ని దాచుకొని బావురుమంది లక్ష్మీదేవి.

పసిబిడ్డను తల్లి పొదివి పట్టుకొన్నట్లు రెండు చేతులతో పట్టుకొన్నాడు భర్త భార్యను.

“ ఊరుకో లక్ష్మీ ! మరీ అంతగా కుమిలిపోతే ఎట్లా చెప్పు ? ” తనకు తనే ధైర్యం చెప్పుకుంటున్నట్లూ, విచ్చిపోతున్న తన హృదయాన్ని కూడదీసుకుంటున్నట్టు వున్నాయి ప్రకాశరావు మాటలు. లక్ష్మి కళ్లుతుడుచుకొని భర్త మొహంలోకి చూసింది ఓ క్షణం.

‘ఏవండీ, ఇప్పుడు మన బాబు ఏం చేస్తూవుంటాడు ?’

“ పసివాడు ఏం చేస్తూ వుంటాడు ! అర్ధరాత్రి హాయిగా నిద్రపోతూ వుంటాడు. ”

లక్ష్మి కళ్ళు ఓ క్షణం సంతోషంతో వెలిగిపోయాయి. అంతలోనే అకస్మాత్తుగా కరెంటు ఆగిపోయినట్లు ఆమె కళ్ళలో వెలుగు ఆరిపోయింది. చీకటి తెరలు అలుముకున్నాయి.

‘ నిజంగా ? మీకు హాయిగా నిద్రపోతున్నాడనే అనిపిస్తుందా ? ఒకవేళ ఏ బిచ్చగాళ్ళకో దొరికివుంటే.... కళ్ళు.... తోడేశారేమో ! నా బాబు ఎలాంటి రాక్షసుల చేతుల్లో పడ్డాడో !’ దూరంగా ఏదో చూస్తున్నట్లున్నాయి ఆ చూపులు. మాటలు పలవరిస్తున్నట్లున్నాయి.

' ఛ! ఏమిటి లక్ష్మీ! నీ పిచ్చి! మన బాబుకు ఏమీ కాదు. సుఖంగా నిద్రపోతూ వుండి వుంటాడు.'

' మళ్ళీ మన బాబు తిరిగి వస్తాడా ?'

' తప్పక వస్తాడు లక్ష్మీ! మన బాబు త్వరలోనే మనకు దొరుకుతాడు ?'

"నిజంగా! అలా అనిపిస్తుందా మీకు? నా కళ్ళలోకి చూసి చెప్పండి" అంది లక్ష్మి భర్త మొహంలోకి ఆశగా చూస్తూ.

' నిజంగా లక్ష్మీ! మన బాబు మనకు తప్పక దొరుకుతాడు ' అన్నాడే కాని ఆ మాటలు అనేప్పుడు లక్ష్మి ముఖంలోకి చూడలేదు. కళ్ళల్లో తిరిగిన నీరు కట్టలు తెంచుకోకుండా ప్రయత్నించాడు.

" పోలీస్ స్టేషనుకు ఇవ్వాళ ఫోన్ చేశారా ?"

" ఆఁ చేశాను. ఇంకా ఆమాకీ దొరక లేదట. అన్ని ముఖ్యమైన పోలీస్ స్టేషన్లకూ బాబు ఫోటో కూడా పంపించారట."

' మొన్న వెంకటనర్సు ఏమందనుకున్నారు? ఇవ్వాళ కమల కూడా యేవేవో కథలు చెప్పిందండీ! మన బాబు యెలాంటి రాక్షసులు చేతుల్లో పడ్డాడో! మన బాబు బిచ్చం ఎత్తుకుంటున్నాడేమో! నా బాబుకు కళ్ళు

తీసేశారేమో ! ఇలాంటి ఆలోచనలు ప్రతి నిమిషం నా ప్రాణాల్ని తోడేస్తున్నాయండీ! అంతకంటే మన బాబు చచ్చిపోయినా బాగుండేది. '

ప్రకాశరావు ఉలిక్కిపడి భార్య నోటికి చెయ్యి అడ్డుపెట్టాడు.

' ఏమిటి లక్ష్మీ పిచ్చిదానిలా మాట్లాడతావు ? బాబు చచ్చిపోవాలా ? ఎంత మాట అన్నావు ! ' అన్నాడేకాని ప్రకాశరావుకు అలా జరిగితేనే ఇంతకంటే బాగుండేదేమో ననిపించింది. ఈ బాధను మర్చిపోలేరు తమ బిడ్డ ఎక్కడున్నాడో ! ఎలా వున్నాడో ! ఎంత పెరిగాడో ! అసలు వున్నాడో లేడో అనే ప్రశ్నలు జీవితాంతం, చాలీ చాలని పగటి నిద్రవల్ల వచ్చే తలనొప్పిలా మనస్సుకు నొప్పిని కలిగిస్తూనే వుంటాయి. ఆలోచిస్తున్న ప్రకాశరావు కేసి చూస్తూ ఒక్కసారిగా ప్రశ్నించింది లక్ష్మి.

" మీకూ అలాగే అనిపిస్తుంది కదూ ? "

'ఆఁ ఆఁ. కాదు.... కాదు....మన బాబు మంచివాళ్ళకే దొరికి వుంటాడు. ఏ పిల్లలు లేనివాళ్ళకో దొరికి వుంటాడు. ఏ చల్లని తల్లి ఒళ్ళోనో పెరుగుతూ వుండి వుంటాడు. మన బాబు క్షేమంగా వుంటాడు లక్ష్మీ ! ' గబగబా అనేశాడు ప్రకాశరావు వల్లించిన పాఠాన్ని అప్పగిస్తున్న పసివాడిలా.

"అవును. మన బాబు కులాసాగానే వుండి వుంటాడు. మంచివాళ్ళకే దొరికి వుంటాడు. నా బాబు ఏ బిచ్చగాళ్ళకో, ఏ రౌడీలకో దొరికి వుండడు. నా బాబు ఎక్కడున్నా నాకు దిగులు లేదు. కేవలం నా బాబు కులాసాగా వున్నాడని తెలిస్తే చాలు. ఏమండీ, కనీసం ఆ వార్తయినా మన చెవుల్లో పడితే చాలండీ. నా బాబు!" పొర్లుకొస్తున్న దుఃఖాన్ని గొంతులోనే ఆపుకుంది లక్ష్మీదేవి!

"పడుకో లక్ష్మి! చాలా ప్రొద్దుపోయింది. ఎన్ని రోజులు నిద్రాహారాలు లేకుండా వుంటావు? నువ్వు మూలబడితే నా పనేంగాను చెప్పు!" ప్రతిమాలుకున్నాడు ప్రకాశరావు సౌమ్యంగా!

'నిద్రపోవాలంటే భయమేస్తోందండీ. బాబుమీద అన్నీ పీడ కలలే!'

'ఇప్పుడు మాత్రం ఎలా వుంది! పీడకల చూస్తున్నట్లు లేదూ?' అన్నాడు ప్రకాశరావు తనను తనే ప్రశ్నించుకుంటున్నట్లు.

'పడుకో లక్ష్మి!' అన్నాడు జాలి పుట్టిపడే కంఠంతో.

బాగా అలిసిపోయివున్న లక్ష్మి మంచంమీదకు వాలిపోయింది. ప్రకాశరావు లేచి లైటు ఆర్పివచ్చి తన

మంచంమీద అడ్డంగా పడ్డాడు. ఎంత ప్రయత్నించినా యిద్దర్లో యే ఒక్కరికి నిద్ర పట్టడంలేదు. ఈ వారం రోజులుగా విన్న రకరకాల కథలూ బుర్రలో గజిబిజిగా తిరగసాగాయి.

*　　*　　*

ప్రకాశరావు ఓ పెద్ద ప్రైవేట్ ఎన్‌టర్‌ప్రయిజింగ్ కంపెనీకి మానేజింగ్ డైరెక్టరు. రాబడి నెలకు నాలుగే వేలు. కంపెనీలోవున్న షేర్లు కాక భార్య తరఫున బోలెడంత ఆస్తి వచ్చింది. కానీ చాలాకాలం ఆ దంపతులకు సంతానంలేని కొరత బాధిస్తూ వుండేది. లక్ష్మి మొక్కని దేముళ్ళూ, పట్టని నోములూ లేవు. కాపరానికి వచ్చిన పదేళ్ళకు ఆమె కడుపు పండింది. పండులాంటి కుర్రాడు కలిగాడు. మళ్ళీ ఆమెకు పిల్లలు కలగలేదు. "ఒక కన్ను కన్నూ కాదు, ఒక బిడ్డ బిడ్డా కాదు" అనే సామెతను జ్ఞాపకం చేసుకుంటూ కంటిరెప్పతో కనుపాపన్ను కాపాడినట్లు పెంచసాగారు. ఐదేళ్ళకే బాగా పెరిగాడు. పచ్చగా బొద్దుగా ఠీవిగా కనిపించేవాడు. తమ జీవితాలకు వెలుగురేఖలా, ఆశాకిరణంలా లభించిన ఆ పసివాడికి సూర్య చంద్రుల పేర్లను జోడించి 'రవిచంద్ర' అని నామకరణం చేశారు ఆ దంపతులు.

ప్రకాశరావు దంపతులు బిడ్డను తీసుకొని గోదావరీ పుష్కరాలకు వెళ్ళారు. అక్కడే బిడ్డ తప్పిపోయాడు. రెండురోజులు పోలీసు సహాయంతో రాజమండ్రి అంతా గాలించారు. కాని రవి జాడ తెలియలేదు. ప్రాణాలను వదిలేసి శరీరాలను మాత్రం హైదరాబాదుకు చేర్చారు. పోలీసు డిపార్టుమెంటువారు బిడ్డ తప్పక దొరుకుతాడని ఆశ చూపించారు.

హైదరాబాదు చేరిన పరుక్షణంనుంచీ, స్నేహితులూ, బంధువులూ, ఆఫీసువాళ్ళూ పరామర్శించటానికి వస్తున్నారు. ప్రకాశరావు దంపతుల బాధను చూసి కన్నీరు పెట్టనివారు లేరు. సానుభూతికి లోపం లేదు. కాకపోతే వాళ్ళు మళ్ళీ మళ్ళీ అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పటం, వారు వినిపించే వింత కథలను వినటం అంటేనే కష్టంగా వుంది ప్రకాశరావుకు. ప్రతివాళ్ళూ వచ్చి అంతకుముందు వచ్చినవారు వేసిన ప్రశ్నలే వేస్తారు. కాకపోతే వారు వినిపించే కథలు మాత్రం వేరు వేరు. గుండెల్ని పిండేసేలా దారుణంగా వుంటున్నాయి ఆ కథలు.

'పోలీసు రిపోర్టు ఇచ్చారా?'

'అసలు ఎలా తప్పిపోయాడండీ?'

'పేపర్లో వేయించారటగా.'

'అయినా ఆచూకీ దొరకలేదు కదూ?'

'ఇలా తప్పిపోయిన పిల్లలు మళ్ళీ దొరకటం చాలా కష్టం!'

'పాపం! ఉన్న ఒక్క బిడ్డా ఇలా అయాక మీ జీవితాలు వ్యర్థమే!'

"ఏ మంచి కుటుంబీకులకో దొరికివుంటే ఈపాటికి వాళ్ళు బిడ్డను పోలీసులకు అప్పజెప్పి వుండేవాళ్ళే!"

"ఏ రౌడీల చేతుల్లో పడ్డాడో!"

"ఏ అడుక్కు తినేవాళ్ళకు దొరికాడో? అడుక్కొనే వాళ్లు ఇలాంటి బిడ్డల్ని ఎత్తుకుపోయి, అంగవైకల్యం కలిగించి, వాళ్ళచేత బిచ్చం ఎత్తిస్తారట!'

"ఈ మధ్య పిల్లల్ని దొంగిలించేవాళ్ళు ఎక్కువయ్యారు. నా స్నేహితురాలు పనిచేసే ఆఫీసులో ఒకావిడ వుందట. ఆమె కొడుకు స్కూలుకు వెళ్ళినవాడు తిరిగి రాలేదట!"

"అయ్యో పాపం!"

"చిత్రం ఏమంటే! ఆవిడకు యెనిమిదిమంది సంతానం అట. నెలలో సగం రోజులు పస్తులు వుండాల్సిందేనట. ఆవిడ పిల్లవాడు కనిపించటంలేదని నవ్వుతూ చెబుతుందట."

'ఒక్కడు తగ్గినా తగ్గినట్లేనని ఆమెకు సంతోషమేమో!'

'ఎన్నాళ్ళయింది ఆ కుర్రాడు కనిపించక ?' ఆత్రంగా ప్రశ్నించాడు ప్రకాశరావు.

"ఆరు నెలలు కావస్తోంది."

'వయస్సు ఎంత ?'

"ఎనిమిదేళ్ళట !"

ప్రకాశరావు నిట్టూర్చాడు. లక్ష్మి ముఖానికి పైటచెంగు అడ్డం పెట్టుకుని కుమిలి కుమిలి ఏడుస్తోంది.

ఒకరోజు....

"ఇలా తప్పిపోయిన పిల్లలు సాధారణంగా మళ్ళీ దొరకరు" సానుభూతితో అంది ఓ యాభై సంవత్సరాల పునిస్త్రీ.

"అవును ! చిన్నపిల్లల్ని ఎత్తుకెళ్ళి బొంబాయిలో అమ్ముకుంటారట. ఇది కూడా ఒక వ్యాపారంగానే జరుగుతుందట !" ఆవిడకు వంతపలికింది మరో స్త్రీ.

'మా మేనత్తగారి కోడలికి పెద్దాడపడుచు స్నేహితురాలి మేనమామ కొడుకు యిలాగే కోటప్పకొండ తిరనాళ్ళకు వెళితే తప్పిపోయాడట.'

'దొరికాడా ?' కళ్ళతోనే ప్రశ్నించింది లక్ష్మి ఆదుర్దాగా.

'వాళ్ళకూ వాడు ఒక్కడే కొడుకు. వెతికి వెతికి చివరకు తల్లిదండ్రులు ఆశ వదిలేసుకున్నారు.'

లక్ష్మి కళ్ళల్లో నీరు గిర్రున తిరిగాయి! ప్రకాశరావు గట్టిగా నిట్టూర్చాడు.

'మళ్ళీ ఆ పిల్లాడు దొరకనేలేదా?' మొదటి స్త్రీ ప్రశ్నించింది.

'వినండి మరి! ఆ తరువాత నాలుగేళ్ళకు ఆ పిల్లవాడి మేనమామ ఏదో బిజినెస్‌మీద బొంబాయి వెళ్ళాడు. అయన బస్టాండులో నిల్చుంటే అడుక్కొనేవాళ్ళు ఒకటే తొందర పెట్టారట. ముఖ్యంగా ఓ కుంటిపిల్లాడు మెడ నరాలు ఉబ్బేలా పెద్దగా అరుస్తూ యాచిస్తున్నాడట. విసుగ్గావుండి రెండడుగులు వెనక్కి వేసిన అతని కాళ్లకు చుట్టుకు పోయాడట ఆ కుర్రాడు. వంగి విసుగ్గా ఆ కుర్రాడి చేతుల్ని వదిలించుకోబోయాడట.

"మామయ్యా" ఆ పిల్లవాడి పిలుపుకు ఉలిక్కిపడి ముఖంలోకి చూశాడట. మామా అల్లుళ్ళు ఒకర్నొకరు గుర్తించుకున్నారు. ఒకర్నొకరు కౌగిలించుకొని బావురు మన్నారట.

'ఆ, ఆఁ తరవాత!' అదుర్దాగా ప్రశ్నించింది ఓ యువతి.

'ఆ కుర్రాడు తనను యెలా మాయమాటలతో ఓ బిచ్చగాడు తప్పించి తీసుకెళ్ళిందీ, తన కాళ్ళను ఎలా విరిచి తనను బిచ్చం ఎత్తటానికి ఉపయోగించుకుంటున్నదీ చెప్పాడట. ఆ కథ విసీ, ఆ కుర్రాడి రూపాన్ని చూసి ఆ మేనమామకు మతిపోయినంత పనయిందట. ఏం చెయ్యాలో తోచలేదట. రేపు మంచి బట్టలు తెచ్చి తీసుకెళతాననీ, అదే బస్‌స్టాండ్‌లో కలవమనీ చెప్పి అతను అక్కడనుంచి వెంటనే బయలుదేరి చెల్లెలిగారి ఊరికి వచ్చేశాడట !'

'కుర్రవాణ్ణి వదిలేశా ?' ఆశ్చర్యంగా ప్రశ్నించాడు వృద్ధుడు.

'అవును ! ఆ స్థితిలో ఆ కుర్రాణ్ణి మళ్ళీ తెచ్చుకోవటమా లేదా అనేది అతనికి తోచలేదట !'

"ఆఁ ఆ తరవాత !"

'ఆ పిల్లవాడి తల్లి అన్నను నానా మాటలు అందట ! బావమరిది కూడా పిల్లవాణ్ణిచూసి తీసుకురానందున నానా మాటలూ అన్నాడట ! దానికి జవాబుగా 'మీకు చాదస్తం ఎక్కువ. ఎక్కడలేని ఆచారాలాయె ! కుర్రాడు ఎలా పెరిగాడో తెలిసి తీసుకురాలేకపోయాను' అని జవాబిచ్చాడట. ఆరోజే తల్లిదండ్రులూ, మేనమామా బొంబాయికి బయలుదేరారట.'

"మరి కాదూ! కన్నబిడ్డను ఆచారాలంటూ వదిలేసు కుంటూరా?"

"నువ్వూరుకోవమ్మా! చెప్పనియ్!" అందరూ వచ్చిన పని మర్చిపోయి కథ వినటంలో నిమగ్నమై పోయారు.

"ఆఁ అ తరవాత ఏం జరిగింది!"

"వాళ్ళు బొంబాయిచేరి ఆ బస్‌స్టాండు దగ్గరకు వెళ్ళారట. కాని ఆ కుర్రాడు కనిపించలేదు. బొంబాయిలోని అన్ని బస్‌స్టాండులూ గాలించారు. కాని కుర్రాడు కనిపించలేదు. నెలరోజులు బొంబాయిలో వున్నా కుర్రాడు కనిపించలేదట. ఏం చేస్తారు? గుండె రాయిచేసుకొని తిరిగి వచ్చారు" అంది.

"ఈ అడుక్కుతినేవాళ్ళు చేసే పనులు చాలా భయంకరంగా వుంటాయి. కళ్ళు పొడిచేసీ, కాళ్ళు చేతులూ విరిచేసీ, పిల్లల్ని వికృతరూపుల్నిచేసీ, వాళ్ళద్వారా డబ్బులు సంపాదిస్తారట! కొందరు అడుక్కునేవాళ్ళకు బ్యాంక్ బాలెన్స్‌కూడా వుంటుందట!"

లక్ష్మి కెవ్వున కేకవేసింది. మరుక్షణంలో తెలివి తప్పిపోయిన ఆమెచుట్టూ సానుభూతి చూపించటానికి వచ్చినవాళ్ళు మూగారు. ప్రకాశరావు మరో స్త్రీ సహాయంతో ఆమెను ఇంట్లోకి తీసుకెళ్ళి పడుకోబెట్టాడు.

ఆరోజు కనుచీకటి పడుతుండగా ప్రకాశరావు స్నేహితుడు రఘూ, అతని భార్యా పలకరించటానికి వచ్చారు. వారిని చూడగానే లక్ష్మి బావురుమంది. రఘు భార్య ఆమెను పట్టుకొని కూర్చుంది. ప్రకాశరావు గుడ్లనీరు గుడ్ల కుక్కుకున్నాడు.

"ఎంత అన్యాయం జరిగింది! ఇవ్వాళే మాకు తెలిసింది!" అంది రఘు భార్య కళ్ళనీరు పెట్టుకుంటూ.

'పోలీసువాళ్ళు ఇంకా ఆచూకీ తియ్యలేదా?' లేదన్నట్లు తల ఊపాడు ప్రకాశరావు.

"పేపర్లలో వేయించక పోయ్యారూ?"

"ఇంగ్లీషు పేపర్లలో వేయించాను. నిన్ననే తెలుగు పేపర్లకు కూడా పంపించాను" అన్నాడు ప్రకాశరావు.

"ఎవరి చేతుల్లో పడ్డాడో ఏమో!" అన్నాడు రఘు.

"మంచి వ్యక్తులకు దొరికితే ఈపాటికి ఆచూకీ తెలిసి వుండేదే!" అంది రఘు భార్య.

"ఈ మధ్య పిల్లలు పోవడం ఎక్కువయిపోయింది. నళ్ళీ దొరకటం కష్టమే" జాలీ, సానుభూతి పుట్టిపడుతూ అన్నాడు రఘు.

"అవునండీ? ఇలా దొరికిన పిల్లల్ని దొంగతనాలకు కూడా ఉపయోగిస్తారట గదూ?" రఘు భార్య కుతూహలంగా ప్రశ్నించింది.

"అవును. పిక్‌పాకెటింగ్‌కు ఉపయోగిస్తారు. దొంగతనాలలో కూడా పిల్లల్ని ఉపయోగిస్తారట."

"పిల్లల్ని కిటికీలగుండా లోపలికి దించి వాళ్ళచేత అవసరమైన పనులు చేయిస్తారట. ఆలివర్ ట్విస్ట్ చదవ లేదూ ?" చదువుకున్న భార్యను ప్రశ్నించాడు రఘు.

వచ్చిన విషయం, అక్కడి వాతావరణం మర్చిపోయి కబుర్లలో పడిపోయారు భార్యాభర్తలు. అప్పుడే వచ్చిన గోపాలరావు కూడా మౌనంగా కూర్చుని కుతూహలంగా వినసాగాడు. గోపాలరావు ప్రకాశరావు కంపెనీలో మేనేజరు. అతనితో ఇంజినీరు కోటేశ్వరరావు కూడా వచ్చాడు.

"అవును! ఆ మధ్య నా స్నేహితుడి బావమరిది తమ్ముడి కొడుకు ఇలాగే తప్పిపోయాడని తెలిసింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా కుర్రాడి జాడ తెలియలేదు. మూడేళ్ళ తర్వాత మద్రాసులో సాక్షాత్తూ వాడి పెదనాన్న జేబు కత్తిరిస్తూనే దొరికాడట" అన్నాడు గోపాలరావు.

'నిజంగా!' అశ్చర్యంతో కళ్లు పెద్దవి చేసింది రఘు సతీమణి.

'అవునండీ! నిజమే! తర్వాత వాడు ఇంటికివచ్చి కూడా చిన్న చిన్న దొంగతనాలు మొదలుపెట్టాడట. చివరకు ఒకనాడు మళ్ళీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడట!

ఆ జీవితానికి ఒకసారి అలవాటుపడ్డాక మళ్ళీ ఇంటిపట్టున బుద్ధిగా వుండటం కష్టమే !' అన్నాడు గోపాలరావు.

" అంతకంటె దారుణాలు జరుగుతాయి. ఆ మధ్య బ్లిడ్జిలో చదివాను. ఎంత దారుణమైన వార్త అనుకున్నారు ? ఒక స్త్రీ బస్‌స్టాండ్‌లో బిచ్చమెత్తుకుంటూ వుందట. ఇది బొంబాయిలో జరిగింది. నిజంగానే జరిగింది సుమండీ ! ఆమె చంకలో ఓ బిడ్డ—రెండేళ్లుకూడా నిండనివాడు వున్నాడట. వాడి కళ్ళకు గుడ్డకట్టి వుందట. ఆ బిడ్డ హృదయవిదారకంగా ఏడుస్తున్నాడట ! చంకలో బిడ్డ మెలికలు తిరిగిపోతున్నాడట. ఆ బిడ్డ రోదన వింటే పరమ రాక్షసుడిలో కూడా నిద్రిస్తున్న మానవత్వం ఉలిక్కిపడి లేచి కూర్చుంటుందట. ఆ బిడ్డ ఏడుపు దారేపోయే వాళ్ళను ముందుకు అడుగు వెయ్యనివ్వటంలేదట చుట్టూ చేరిన జనం అడిగే ప్రశ్నలకు నిర్లక్ష్యంగా జవాబు చెప్పకుండా వాళ్ళనే డబ్బులు అడగసాగిందట ఆ ఆడది. ఆ దారే పోయే డాక్టర్ కూడా ఆగిపోయి ఆ స్త్రీ దగ్గరకు వచ్చాడట. పిల్లవాడి బాధ యేమిటో చూస్తానన్నాడు. కాని ఆ స్త్రీ అందుకు అంగీకరించలేదు. చివరకు చుట్టూ చేరిన జనం పిల్లవాణ్ని బలవంతంగా ఆ స్త్రీ నుంచి వేరుచేశారు. డాక్టర్ పిల్లవాడి కళ్ళకు కట్టిన గుడ్డను లాగేశాడు. ఆ దృశ్యం చూసి మానవత్వమే సిగ్గుతో తల వంచిందట ! సృష్టికే

శృంగారంగా ఎంచబడే మానవుడు, ఇతర జంతువులకంటె శ్రేష్ఠమైన ప్రాణిగా పరిగణించబడే మనిషి యెంత వికృతంగా, క్రూరంగా, భయంకరంగా వుంటాడో తెలియచేసే దృశ్యం అది అ స్త్రీ, మాతృదేవతగా పూజింపబడే స్త్రీ, చేసిన పైశాచిక కృత్యం అది. ఆ దృశ్యాన్ని చూడలేక చాలామంది కళ్ళు మూసుకున్నారు. పిల్లవాడి కనుగుడ్లమీద బొద్దెంకలు వున్నాయి. అవి కొంచెం కొంచెం కనుగుడ్లను పీకుతుంటే ఆ పసి ప్రాణం విలవిల్లాడిపోతోంది. ఆ స్త్రీ బొద్దెంక కంటే వికృతంగా కనిపించి వుండాలి ఆ క్షణంలో అక్కడ చేరినవాళ్ళకు " అప్పుడప్పుడు కథలు రాస్తూవుండే కోటేశ్వరరావు చెప్పుకుపోతున్నాడు ఉద్రేకంగా!

'ఎంత దారుణం. అది ఆడది కాదు. రాక్షసి' అంది రఘు భార్య కదిలిపోయి.

'ఆవిడ అలా రాక్షసిగా మారటానికి కారణం?' కోటేశ్వరరావు అన్నాడు అదే ఉద్రేకంతో.

'ప్రేమ, సానుభూతి మనిషిని మనిషిగా చేస్తాయి. ఆ ఆడదాని గుండెల్లో ప్రేమకు స్థానం లేదు' అన్నాడు గోపాలరావు.

'హుం ప్రేమ! సానుభూతి; ఈ మాటలకు అర్థం ఆకలి ఎరగదు' రచయిత కోటేశ్వరరావు అన్నాడు.

'అంటే! ప్రేమకంటే కూడా ఆకలి గొప్పదంటారా ?' రఘు ప్రశ్నించాడు వ్యంగ్యంగా.

' గొప్ప సంగతి నాకు తెలియదు. మనిషిని ఆకలి శాసించినంతగా మరొకటి శాసించలేదని నా ఉద్దేశం. '

' నేను ఒప్పుకోను ' మొండిగా అన్నాడు రఘు.

" ఎలా ఒప్పుకుంటారు? మీకు ఆకలంటే ఏమిటో తెలిస్తే కదూ? విశ్వామిత్రుడంతటివాడు కుక్కను తిన్నాడు! ఇక మామూలు మనిషి, ఆకలి పంజాలో చిక్కుకున్న సాధారణ మానవుడు, ఏం చెయ్యడు ? " అన్నాడు కోటేశ్వరావు ఇనుమడించిన ఉద్రేకంతో.

' అంటే మీరు ఆ ఆడదాని పైశాచిక కృత్యాన్ని సమర్థిస్తున్నారన్న మాట !' ఈసడింపుగా అన్నాడు రఘు.

' సమర్థించటంలేదు. ఆ ఆడదాన్ని పిశాచిని చేసిన పరిస్థితుల గు రి ం చి ఆలోచించమంటున్నాను. అలా ఆలోచిస్తే నువ్వూ, నేనూ సిగ్గుపడాలి. ఆవిడ కాదు. ' విసురుగా వచ్చి తగిలాయి కోటేశ్వరావు మాటలు.

అకస్మాత్తుగా కోటేశ్వరావు వాగ్ధోరణి ఆగిపోయింది. ప్రకాశరావు కొయ్యబారి కుర్చీలో బిగుసుకుపోయి వున్నాడు. అతనిలోని చైతన్యం ఘనీభవిస్తున్నట్టుంది. తెలివితప్పి పడిపోయిన లక్ష్మి ముఖంమీద సుమత నీళ్ళు

చిలకరిస్తోంది. కోటేశ్వర్రావు, రమా తమ పొరపాటును గ్రహించి బాధపడ్డారు.

* * *

"అడుగో నా బాబు! నా బాబు దొరికాడు! నా కన్నా కనిపించాడు!" పరుగెత్తుకెళ్ళి బస్‌స్టాండ్‌లో నిల్చున్న పిల్లవాణ్ణి ఎత్తుకొని గుండెలకు అదుముకుంది లక్ష్మి. ఒళ్ళంతా నిమిరి నిమిరి చూసుకుంది. "బాబూ! నన్ను చూడకుండా ఎలా వుండగలిగావురా!" అంటూ గడ్డం పట్టుకుని ముఖాన్ని పైకి ఎత్తింది. ఒక్కసారిగా శరీరంలో కరెంటు షాక్ కొట్టింది. గావుకేక పెట్టింది. పిల్లవాడి పెద్ద పెద్ద కళ్ళ స్థానంలో, రెండు గుంటలు తల్లి మొహంలోకి జాలిగా చూశాయి. లక్ష్మి పిచ్చిగా ఏడుస్తోంది.

ప్రకాశరావు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. లక్ష్మి నిద్రలోనే ఏడుస్తోంది గబగబా లేచివచ్చి లక్ష్మిని కుదిపి కుదిపి లేపాడు. కళ్ళు తెరచిన లక్ష్మి పిచ్చిదానిలా వెర్రిచూపులు చూస్తోంది. ఒళ్ళంతా చెమటపట్టి వుంది.

"ఏడీ! నా బాబు ఏడీ! మీరంతా రాక్షసులు. మనుషులు కారు. జంతువులు, పురుగులు, బొద్దెంకలు" పిచ్చిగా అరుస్తున్న లక్ష్మిని పొదివి పట్టుకున్నాడు ప్రకాశరావు.

" లక్ష్మీ ! ఏమిటది పిచ్చిదానిలా ! చూడు ! కల వచ్చిందా ? "

" పిచ్చి ! నాకేం పిచ్చి లేదు. మీ అందరికీ పిచ్చి ! అందుకే నా బిడ్డను ఎత్తుకెళ్లారు. నా బిడ్డ కళ్ళను పీకేశారు. అదుగో నా రాజా ఎవర్నో పైసలు అడుగుతున్నాడు. నా బాబు బిచ్చం ఎత్తుకుంటున్నాడు. " పిచ్చిదానిలా మాట్లాడుతూ పోతోంది.

' ఏమిటి లక్ష్మీ మరీ ఇంతగా ఇదైపోతే ఎట్లా. పడుకో ! రేపు మన బాబు వస్తాడు ! తప్పక వస్తాడు ! ' అన్నాడు ప్రకాశరావు అంతకంటె భార్యను ఎలా ఓదార్చాలో అర్థంకాక.

లక్ష్మి కన్నార్పకుండా కొంచెంసేపు ప్రకాశరావు మొహంలోకి చూసింది. ప్రకాశరావుకు లక్ష్మి చూపులు కొత్తగా అనిపించాయి. కొంచెం భయంకూడా వేసింది.

అలా చూసి చూసి ఒక్కసారిగా మంచంమీద పడుకొని కళ్ళు మూసుకుంది లక్ష్మి. ప్రకాశరావు కొంచెంసేపు అలాగే కూర్చునీ చిన్నగా లేచాడు. అలా లేచి వెళ్ళి లైటు ఆర్పుతున్న ప్రకాశరావును కళ్ళుతెరిచి చూసింది లక్ష్మి.

మానసికంగా, శారీరకంగా కూడా బాగా అలసి పోయిన ప్రకాశరావుకు మంచంమీద నడుం వాల్చగానే నిద్ర పట్టింది.

* * *

బస్‌లూ, లారీలూ, రిక్షాలూ, కార్లూ, సైకిళ్ళూ జనం, ఎక్కడ చూసినా జనం! హడావిడిగా వుంది బజారు. బస్‌స్టాండ్ రద్దీగా వుంది. ప్రకాశరావు జనాన్ని తోసుకుంటూ వెళ్లి బస్ ఎక్కబోయాడు. అంతలో ఎవరో తన జేబులో నుంచి, చెయ్యితీసి నట్లనిపించింది. జేబు తడుముకొన్నాడు. పర్సు లేదు. వెనక్కు చూశాడు. ఓ కుర్రాడు పరుగెడు తున్నాడు. "పట్టుకోండి! పట్టుకోండి!" జనాన్ని తప్పించుకుని వచ్చి కేక పెట్టాడు. "పట్టుకోండి! పట్టుకోండి! దొరికాడు! దొంగ గాడిద!" అంటూ కేకలు. "కొట్టండి! కొట్టండి! తన్నండి! గాడిద!" "అమ్మోయ్ బాబోయ్! నన్ను వదలండి!" ఏడుస్తున్నాడు కుర్రాడు. 'ఇదిగో పర్సు' ఎవరో కుర్రాడి జేబునుంచి పర్సు బయటకు తీశారు. 'అదే! నాదే! నాదే!' అంటూ ప్రకాశరావు ముందుకు వచ్చి పర్సు అందుకున్నాడు. అంతలో ఒకడు బూటుకాలితో కుర్రాడి ముఖంమీద తన్నాడు 'రక్షించండి! చంపేస్తున్నారు!' అంటూ కుర్రాడు ప్రకాశరావు కాళ్ళకు

చుట్టుకున్నాడు. 'ఆగండి! కొట్టకండి!' అరిచాడు ప్రకాశరావు. అందరూ ప్రకాశరావువైపు వింతగా చూశారు. ప్రకాశరావు వంగి కుర్రవాణ్ణి రెండు చేతులతో లేపి నిలోచ్చపెట్టాడు. కుర్రాడి నోటినుంచీ, ముక్కులనుంచి రక్తం కారుతోంది! కుర్రాడి మొహంలోకి జాలిగా చూసి అంతలోనే ఉలిక్కిపడి "బాబూ!" అంటూ గావుకేక పెట్టాడు........

ప్రకాశరావు తృళ్ళిపడి లేచాడు. నాలక పిడచ కట్టుకొని పోయింది. గొంతు ఎండిపోతున్నట్లనిపించింది. ఒళ్ళంతా చిరుచెమటలు పట్టింది. మంచినీళ్ళు తాగటానికి లేచి లైటు వేశాడు. కూజాలో నీళ్ళు వణుకుతున్న చేత్తో వంపుకుని గ్లాసెడు నీళ్ళు గటగటా తాగాడు. ప్రాణం వచ్చినట్లయింది. తన కేకకు లక్ష్మి మేలుకోలేదు. మంచిదే అయింది. లక్ష్మి మంచంవైపు చూశాడు. ఖాళీ మంచం! ప్రకాశరావు గుండెలు దడదడ లాడాయి. గబగబా గది బయటకు పరుగెత్తాడు. ఓరవాకిలిగా వేసివున్న పూజ గదిలోంచి సన్నని వెలుగు బయటకు ప్రసరిస్తున్నది. యాంత్రికంగా వెలుగు వస్తున్నవైపుకు నడిచాడు. గదిలో నుంచి మాటలు వినిపిస్తున్నాయి. ప్రకాశరావు ఆగిపోయాడు ఆశ్చర్యంతో.

"నా పిచ్చి తండ్రీ! ఈ రెండు ముద్దలు కూడా తిను! ఎన్నాళ్ళయిందో తిని! ఆకలి! ఆకలి కెంత

బాధపడిపోయావో నా చిట్టితండ్రీ! మీగడ పెరుగు కలిపానురా చిట్టితండ్రీ! ఈ ఒక్క ముద్ద, అమ్మ ముద్ద - తినరా బాబూ!" గోముగా, లాలింపుగా మాటలు వినపడ్డాయి! ప్రకాశరావు అయోమయంలో పడిపోయాడు. మాటలు చెవులు రిక్కించి వినసాగాడు.

'ఇన్ని రోజులు అమ్మను చూడకుండా ఎలా వున్నావురా నా చిట్టితండ్రీ! ఏం బాబూ! అమ్మకోసం ఏడ్చావు కదూ? అమ్మను చూడాలని వుందని ఏడ్చావు గదూ?'

అవును! అది లక్ష్మి కంఠమే! ప్రకాశరావు హృదయం ఆనందంతో వెల్లువయింది. తనువు పులకించింది. పీడ కల చెదిరిపోయింది.

అవును. దుస్వప్నంనుంచి తను బయటపడ్డాడు. మాతృహృదయంలోని మమకారం పొడారిపోయిన తన గుండెల్లో మధువును చిలకరించింది. తన బాబు తిరిగి వచ్చాడు! తన వంశోద్ధారకుడు తిరిగి వచ్చాడు! తను ఏకైక పుత్రుడు తిరిగి వచ్చాడు. తన జీవితం, తన ప్రాణాలూ తిరిగి వచ్చాయి.

ఎప్పుడు వచ్చాడూ, ఎలా వచ్చాడూ అన్న ప్రశ్నలను అవతలకు తరిమేసి 'బాబూ! బాబూ!' అంటూ ప్రకాశరావు గదిలోకి పరుగు తీశాడు.

లక్ష్మి పెరుగన్నం కలిపిన వెండిగిన్నెను చేత్తో పట్టుకుని, బాలకృష్ణుని బొమ్మముందు కూర్చుని, ముద్దవున్న కుడిచేతిని ముందుకు చాచి కూర్చొని వుంది. మాట్లాడుతోంది. ముద్దకోసం నోరు తెరవమని ప్రతిమాలుతోంది. ప్రకాశరావు అయోమయంగా కృష్ణుని బొమ్మకేసి చూశాడు. మాతృ హృదయాన్ని బద్దలు కొట్టుకొని వస్తున్న ఆక్రందన కృష్ణ భగవానుని చెవులవరకూ అందినట్లు లేదు.

లక్ష్మి భుజాలు పట్టుకొని కుదుపుతూ 'లక్ష్మీ' అన్నాడు ప్రకాశరావు బాధగా, లక్ష్మి వెనగ్గా కూర్చొని.

లక్ష్మి చేతిలోని గిన్నె కిందపడింది. గిర్రున వెనక్కు తిరిగి ప్రకాశరావు ముఖంలోకి ముఖంపెట్టి చూసింది.

పాలిపోయిన ఆమె ముఖంలో ఏ భావమూ లేదు. ఎక్కడో దూరంగావున్న దేన్నో బెదిరిన చూపులతో చూడసాగింది.

ప్రకాశరావు ఆమెను గట్టిగా కుదుపుతూ 'లక్ష్మీ! లక్ష్మీ!' అంటూ అరిచాడు. ఆమె ఒక్క క్షణం రెప్పలార్పకుండా చూసి, ఒక్కసారిగా నిండుకుండ బద్దలయినట్లు బావురుమంది. కొంచెంసేపు వెక్కి వెక్కి ఏడ్చి చేతులు బిగించి కాళ్ళు నిగడదన్ని ఉద్రేకంగా మాట్లాడసాగింది.

'చెప్పు! నా బాబుని ఏం చేశావ్? ఎక్కడ దాచావ్! అంత అందమైన కళ్ళు పీకెయ్యటానికి నీకు

చేతులెట్లా వచ్చినయ్ ? భగవంతుడు నిన్ను శిక్షించడూ ? తప్పక శిక్షిస్తాడు.

ప్రకాశరావు గుండెల్లో అగ్నిపర్వతాలు బద్దలయాయి. తలలో ఏవేవో ప్రేలుతున్నాయి.

'భగవంతుడా! ఎంత పని చేశావ్!' అనుకున్నాడు మతిచలించినట్లు మాట్లాడుతున్న భార్య మొహంలోకి చూస్తూ. గతులు తప్పుతున్న తన మనస్సును అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నం చేశాడు.

లక్ష్మిని బలంగా పట్టుకొని, తీసుకెళ్ళి మంచంమీద పడుకోబెట్టాడు ఆమె కన్నార్పకుండా భర్తకేసి భయంగా చూస్తూ పడుకుంది.

ప్రకాశరావు గడియారం చూశాడు. ఐదున్నర దాటింది. తెల తెలవారుతోంది. ఒక అరగంటపాటు గదిలోనే, భార్యకేసి చూసీ చూడనట్లు చూస్తూ, అటూ ఇటూ తిరిగాడు. లక్ష్మి ఒక్కసారిగా గబుక్కున నిండా ముసుగు కప్పుకొని నిగడదన్ని పడుకుంది.

ప్రకాశరావు సంక్షోభంలో పడ్డాడు. లక్ష్మికి మతి భ్రమించింది. మరోసారి టైం చూసుకొని ఫోన్ దగ్గరకు వెళ్ళాడు. రిసీవర్ ఎత్తి డాక్టర్‌కు ఫోన్ డయల్ చేశాడు.

'ఇంకా నిద్ర లేచి వుండడు!' ప్రకాశరావు విస్మయంగా లక్ష్మివైపు చూశాడు. లక్ష్మి ముసుగులోనుంచి

తల బయటకుపెట్టి చూస్తోంది. ప్రకాశరావుకు కొంత రిలీఫ్ దొరికినట్లయింది. ఫరవాలేదు, ఈ లోకంలో పడుతుంది అనుకున్నాడు. లక్ష్మి స్థితి అంత ప్రమాదంగా ఏమీ లేదు. త్వరలోనే కోలుకోవచ్చు.

"ఏమిటి లక్ష్మి!" అన్నాడు అంతకు ముందేమీ జరగనట్టే.

"అదే, ఆయన ఇంకా నిద్ర లేవడుగా" అంది లక్ష్మి సౌమ్యంగా.

"ఎవరూ ?" అన్నాడు ప్రకాశరావు ఆమె తోవన పడుతున్నందుకు సంతోషపడుతూ.

"దేముడు!" రహీమని చెప్పింది లక్ష్మి కళ్లు పెద్దవిచేసి.

ప్రకాశరావు గతుక్కుమన్నాడు. లేదు! లాభం లేదు! పూర్తిగా మతిపోయినట్లే వుంది. అవతల ఫోన్ రింగవుతోంది. ఎంతకూ ఎవరూ ఎత్తటంలేదు.

'ఇంకా నిద్రపోతూనే వుంటాడు! నేను చెప్పలా! బాబూ!' అనేసి లక్ష్మి మళ్ళీ ముసుగు బిగించి పడుకొంది.

ప్రకాశరావు రిసీవర్ పెట్టేసి తలపట్టుకొని కూర్చున్నాడు దిగాలుపడి, లక్ష్మిని చూస్తూ. ఓ అరగంట అలాగే ఉండిపోయాడు.

లక్ష్మి ముసుగు తీయలేదు. నిద్రపోతుందేమో! నిద్రపడితే కొంత మార్పు రావచ్చు.

ప్రకాశరావు అన్యమనస్కంగానే స్నానం ముగించి, డాక్టర్‌కు ఫోన్ చెయ్యాలనే ఉద్దేశంతో గదిలోకి వచ్చాడు. అంతవరకూ ముసుగు బయట తలపెట్టి, కప్పుకేసి చూస్తున్న లక్ష్మి ప్రకాశరావును చూసి గబుక్కున ముసుగు లాక్కుంది ముఖంమీదకు. ప్రకాశరావు నిట్టూర్చాడు.

బయటినుంచి తలుపు తట్టిన శబ్దం వినిపించి ప్రకాశరావు చేతిలోని రిసీవర్‌ను కిందపెట్టి తలుపు తెరిచాడు.

"అయ్యగారూ! తమర్ని చూడటానికి ఎవరో వచ్చారు?" అన్నాడు నాయర్ ప్రవేశించి.

"తెల్లవారిందీ; అప్పుడే తయారయ్యారన్నమాట సానుభూతి చూపించటానికి! ఇదిగో నాయర్! ఇకనుంచి ఎవరొచ్చినా, ఇంట్లోకి రానివ్వకు! ఏదో ఒకటి చెప్పి పంపించివేయ్! తెలిసిందా?" విసురుగా చెప్పాడు ప్రకాశరావు.

తెలిసినట్లు తల ఎగరేశాడు నాయర్. కాని నాయర్‌కు ఏమీ తెలియలేదు. నాయర్ తలవంచుకొని మెల్లిగా బయటికి నడిచాడు. ప్రకాశరావు తలవంచుకుని, తిరిగి డయల్ చేస్తూండగా నాయర్ మళ్ళీ ఉప్పెనలా వచ్చి పడ్డాడు.

' అయ్యగారూ ! చినబాబు ! మన చినబాబు ! ' నాయర్ ఉక్కిరి బిక్కిరవుతున్నాడు.

" ఏమిటిరా చినబాబు ? "

' వచ్చారండీ ! ఆ వచ్చినాయనతో చినబాబు వచ్చారండీ ? ' జవాబిచ్చాడు నాయర్ రొప్పుతూ.

" చినబాబా ! ఒరేయ్ నీకూ మతిపోయిందీ ? ఈ ఇంట్లో నాకు తప్ప.... " అంటూ ప్రకాశరావు తెరిచిన నోరు అలాగే వుండిపోయింది. కళ్ళనుంచి ఆనందబాష్పాలు జడివానలా రాలినై.

ఐదేళ్ళ పసివాడు....రవి—తండ్రిని చుట్టేసుకొని ఉద్రేకంతో ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాడు. ప్రకాశరావుకు ఆనందంతో నోరు పెగల్లేదు. పిల్లవాణ్ణి యెత్తుకొని గుండెలకు గాఢంగా హత్తుకున్నాడు. ఒళ్ళంతా నిమిరాడు. ' నాన్నా ! అమ్మ ! అమ్మ ఏదీ ! ' అంటూన్న బిడ్డను యెత్తుకుని ప్రకాశరావు గది బయటకు వచ్చాడు. లక్ష్మి ముసుగులో నుంచి తల బయటకు పెట్టాలా వద్దా అన్నట్లు కాసేపు కదులాడి అంతలోనే బిగుసుకు పడుకుంది.

నీరుకావి ధోవతీ, జరీకండువా, ఖద్దరు లాల్చీలో వున్న అరవై సంవత్సరాల పెద్దమనిషి, వరండాలోకి వచ్చిన ప్రకాశరావును చూసి లేచి నిల్చొని నమస్కారం చేశాడు.

"మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేనిది!" ప్రకాశరావు ముసలాయన రెండు చేతులూ పట్టుకొని కళ్ళనీళ్లు నింపుకున్నాడు.

ఆ పెద్దమనిషి కుర్రాడు తనకు ఏ పరిస్థితిలో దొరికిందీ; కుర్రాణ్ణి తల్లిదండ్రులకు చేర్చడానికి తను ఎన్ని ప్రయత్నాలు చేసిందీ చెప్పి, కాఫీ అన్నా పుచ్చుకోకుండా, అర్జంటు పనులేవో ఉన్నాయంటూ ఆదరా బాదరా వెళ్ళిపోయాడు.

అలా వెళ్ళిపోతున్న ముసలాయనకు వెనుకనుంచి రెండు చేతులూ ఎత్తి మౌనంగా నమస్కరించాడు ప్రకాశరావు.

"నాన్నా, అమ్మ ఎక్కడ? అమ్మను చూపించు" రవి మారాం చెయ్యసాగాడు.

ప్రకాశరావు పిల్లవాణ్ణి ఎత్తుకొని ఆనంద పారవశ్యంతో భార్య పడుకున్న గదిలోకి వచ్చాడు.

'లక్ష్మి! లక్ష్మి! చూడు! ఇదుగో మన బాబు తిరిగి వచ్చాడు. భగవంతుడు కరుణించాడు.'

లక్ష్మి చివాలున లేచి కూర్చుంది. కళ్ళింతింత చేసుకొని కుర్రాణ్ణి చూడసాగింది. ప్రకాశరావు బిడ్డను తల్లికి అందించబోయాడు. రవి భయంతో తన రెండు చేతులూ తండ్రి మెడకుచుట్టి గుండెలో ముఖం దాచుకున్నాడు.

'వీడు నా బాబు కాదు. నా బాబుకు కళ్ళు తోడేశారటగా? వీడి కళ్ళు ఆల్చిప్పల్లా వున్నాయి — వీడు మన బాబెలా అవుతాడు?' కుర్రాణ్ణి అన్నివైపుల నుంచీ పరీక్షగా చూస్తూ అంది లక్ష్మి.

ప్రకాశరావుకు చీకట్లు కమ్మాయ్. 'లక్ష్మి! లక్ష్మి! వీడు మన బాబే! మన రవి! చూడు సరిగ్గా!' కంఠం వణికింది. అశ్రుపూరిత నయనాలతో భావరహితంగా వున్న లక్ష్మి ముఖంలోకి చూస్తూ నిలబడ్డాడు ప్రకాశరావు.

'ఏవండీ! నా బాబును నేను గుర్తుపట్టలేనంటారా? యెవరో బిడ్డను తెచ్చి నన్ను నమ్మించాలని చూస్తున్నారు. నన్ను పిచ్చిదాన్ని చేస్తున్నారా?' బ్రతిమాలుతూ కళ్ళంట బొట బొట నీరు కారుస్తూ అంది.

రవి ఒకసారి తలెత్తి తల్లివైపు చూసి, భయంతో తండ్రి మెడను గట్టిగా చుట్టేశాడు.

ప్రకాశరావు బిడ్డను గుండెలకు అదుముకొని బయటకు పరుగెత్తాడు. ప్రకాశరావును పలకరించటానికి వచ్చిన ఆత్మీయులు ఆయన్ను చుట్టుకున్నారు.

'పిల్లవాడు దొరికాడటగా!'

'పాపం ఆవిడకు మతిపోయిందటగా! ఇప్పుడే నాయర్ చెప్పాడు.'

'పిల్లవాణ్ణి గుర్తుపట్టటం లేదట? నా పిల్లవాడికి కళ్ళు లేవంటుందటగా!'

'జాగ్రత్త. పిల్లవాణ్ణి తల్లి దగ్గరకు పోనివ్వకండి! నిజంగానే పిచ్చిలో కళ్ళు పీకేయగలదు.'

ప్రకాశరావు గుండెల్లో తలదాచుకున్న పసివాడు ఎందుకో బావురుమన్నాడు. ప్రకాశరావుకు చెమటలు పట్టసాగాయి. కళ్ళు తిరుగుతున్నాయి.

"వెళ్ళిపోండి! మీకూ, మీ సానుభూతి వచనాలకు ఓ నమస్కారం" అని గట్టిగా అరవాలనుకున్నాడు. కాని గొంతు పెగల్లేదు. కళ్లు తిరుగుతున్నాయి.

"అయ్యో! అలా అయిపోతున్నారేం? పడిపోతాడేమో పట్టుకోండి!"

"ముందు పిల్లవాణ్ణి తీసుకోండి!"

పిల్లవాణ్ణి తననుంచి లాగినట్లూ, ఎవరి చేతుల్లోనో తను ఒరిగిపోతున్నట్లూ లీలగా, కలలోలా తోచింది ప్రకాశరావుకు.

( 19-7-1968 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక నుంచి )